# నాటక ప్రదర్శనం

**నా** చిన్నతనంలో మా వూళ్ళో ఒక మిడిల్ స్కూల్ ఉండేది. మా గ్రామంలో చాలామంది కుర్రవాళ్ళం అందులో మూడోఫారం దాకా చదువుకున్నాం. వెళ్ళిన వాళ్ళు బస్తీకి వెళ్ళి పైతరగతులు చదువుకొని గట్టెక్కారు. మిగిలిన వాళ్ళు సహాయనిరాకరణోద్యమంలో చదువు సంధ్యలు మానేసి బటాచోరులల్లే తిరగడం మొదలుపెట్టారు. తదుపరి స్కూలు కమిటీలో కక్షలు పుట్టడమూ, బ్రాహ్మణ బ్రాహ్మణేతర సమస్య నియోగి వైదికి సమస్యగా మారడమూ, చివరకు స్కూలు మూయడమూ మొదలైనవి జరిగినై. స్కూలు భవనం చాలా భాగం శిథిలమై పోయింది. ఇప్పుడు దాన్ని ఎందరు ఎన్ని రకాలుగా ఉపయోగించుతున్నారో నావంటి పెద్దమనిషి చెప్పడం సమంజసంగా ఉండదు కనక చెప్పను.

తీరా ఊళ్ళో వాళ్ళు స్కూలు సంగతి యావత్తూ మరిచి పోవటం కూడా మొదలు పెట్టి, స్కూలుచర్చ అరుగులమీద తీసుకురావటం మానేసిన తరవాత - మా పల్లెటూళ్ళలో మాట్లాడుకునేటందుకు బొత్తిగా విషయాలు లేనప్పుడు పుష్కరం నాటి విషయాలు కూడా తవ్వుతూ ఉంటాం - గుంటూరు కాలేజీలో బియ్యే చదువుతున్న మా రామచంద్రుడు ఏం చేశాడనుకున్నారు? స్కూలుకు పూర్వ విద్యార్థి సంఘం ఒకటి ఉందని బయట పెట్టాడు. శాయశక్తులా మేము అటువంటి సంఘం లేదని వాదించాం. కాని వాడు మామాట ఒక్కరవ్వ అయినా ఎక్కరానివ్వక ఉన్నదని ఋజువు చేశాడు. స్కూలు చచ్చినా ఈ పూర్వ విద్యార్థి సంఘం చావదుట.

సరే, బాగానేవుంది. అయితే ఇప్పుడు ఆ సంఘం ఏం చేస్తుందని మేమంతా రామచంద్రుణ్ణి అడిగాం. వాడు వెంటనే సంఘం యొక్క కార్యక్రమం విప్పి చెప్పాడు. ఆ స్కూలులో ఒకరోజయినా సరే చదివిన ప్రతి నర మానవుడూ పుటిక్కిన పూర్వ విద్యార్థిసంఘ సభ్యుడు అయి ఊరుకుంటాడుట. అట్లా చదివినవాళ్ళ జాబితా ముందు మనం తయారు చేయాలన్నాడు రామచంద్రుడు. సరేనన్నాము. ఆ తరవాత సంవత్సరానికి ఒకసారి ఈ సభ్యులంతా ఒకచోట - సాధ్యమైతే స్కూలు ఆవరణలో - చేరి అక్కడ ఒక పగలంతా సరదాగా గడిపి, అక్కడే రెండు పూటలా భోజనం వగైరాలు కానిచ్చి, ఆ రాత్రి ఒక చిన్న నాటకం ఆడి ఇళ్ళకు పోవటం కార్యక్రమం. ఈ విధంగా ప్రతి స్కూలు తరపునా పూర్వ విద్యార్థి సంఘాలు పనిచేస్తవని రామచంద్రుడు మమ్మల్ని గట్టిగా నమ్మించాడు.

తరవాత రెండు రోజులపాటు రామచంద్రుడు ఊళ్ళో ఉన్న ప్రతి అరుగు మీదా కనిపించటం మొదలు పెట్టాడు ఊళ్ళో వాళ్ళు లచ్చయ్య కూతుర్ని పెళ్ళి విషయం కూడా కట్టిపెట్టి, పూర్వవిద్యార్థి సంఘాన్ని గురించే మాట్లాడటం మొదలు పెట్టారు.

రామచంద్రుడి అభిప్రాయం సులభంగానే ఊరియొక్క ఆమోదాన్ని పొందింది. ముందు పూర్వ విద్యార్థుల జాబితా ఒకటి తయారు చేసి చందా వసూలు చెయ్యాలి కనక నలుగురైదుగురం ఆ పని ప్రారంభించాం. పూర్వ విద్యార్థిసంఘ సమావేశం ఒక పదిహేనురోజు లవతల ఏర్పాటు చేశాం.

మొదటి రోజునే పేర్లన్నీ జాబితా అయిపోయినై. కాని మాకు కొన్ని అనుమానాలు కలిగినై. అందుకని మేము నలుగురమూ రామచంద్రుడి దగ్గిరికి వెళ్ళాం.

"ఒరే, రామచంద్రుడూ! స్కూలులో చదివిన ప్రతి వాడూ పూర్వ విద్యార్థి అయితే కొన్ని చిక్కులున్నై చూశావో లేదో!" అన్నాను.

"ఏమిటవి?" అని అడిగాడు రామచంద్రుడు "అనుమానాలు తీర్చటానికి నేనున్నానుగా!" అన్న గొంతుతో.

"ఇట్లా చూడు! ఈ జాబితాలో నలుగురైదుగురు ఛాందసాగ్రేసర సార్వభౌములున్నారు. వాళ్లు ఒకప్పుడు ప్రైమరీదాకా అఘోరించినప్పటికీ ఇప్పుడు ఇంగిలీషు ముక్క మాట్లాడే ప్రతివాణ్ణీ మాలకాకిని చూసినట్టు చూస్తారు. వాళ్ళ సరదాకు మనతోపాటు భోంచేస్తారని నాకు నమ్మకం లేదు. ఒకరిద్దరికి పుట్టెడు దేవతార్చన కూడా ఉంది మరి. వాళ్ళు అక్కడికి వచ్చి గంట వాయించడం మొదలుపెడితే–తెలీలా? మనకు శంఖుతీర్థం కూడా ఇస్తామంటారో ఏం ఖర్మమో!"

"మనం అందర్నీ ఆహ్వానించేదే! వాళ్లు రాకపోతే మన తప్పేముందీ?" అన్నాడు రామచంద్రుడు బింకంగా.

"సరే! ఇటు చూడు. ఈ జాబితాలో మంగలి నాగడి పేరు కూడా ఉంది. వాడు వంద ఇళ్ళకు క్షురకర్మ చేస్తున్నాడు. మరి వాణ్ణి ఆహ్వానిస్తే– వాడు తీరా పుటిక్కన రావచ్చు!"

రామచంద్రుడు నాకు కన్నుకొట్టి రహస్యంగా "వాడి పేరు వదిలేద్దూ!" అన్నాడు.

"చాకలి సుబ్బుడూ అంతేనా?"

"ఊఁ!"

"పోతే, షేక్ ఇమాం! కల్లుపాకా కంట్రాక్టరున్నాడు.

"అందిస్తే అల్లుకుపొయ్యే నేర్పులేదే! నానోటి మీదుగా అనిపించాలీ?"

"సంఘం యొక్క ఆశయాలకు భిన్నంగా ప్రవర్తించటం కాదు కదా ఈ విధంగా పేర్లు కొట్టెయ్యటం?"

"ఓహో! బాగుందే! మన ఆశయాలు మనవి!"

ఏదో విధంగా జాబితా తయారైంది. తరవాత డబ్బు సమస్య వచ్చింది. "డబ్బు ఎంతెంత వసూలు చెయ్యాలి? అది ఎవరు వాడాలి?"

జాబితాలో అరవై పేర్లున్నప్పటికీ ఏ నలభైమందో కన్న రారు కనక, తలా ఒక పావలా అయినా వేసుకోందీ పది రూపాయలు కావు; పది రూపాయలన్నా లేంది సమావేశం జయప్రదంగా జరగదని, చందా తలకొక్క పావలా ఏర్పాటు చేశాం. ఈ డబ్బు యావత్తూ రామచంద్రుడి దగ్గిరే ఉంచేట్టూ, వాడు ఖర్చుకు లెక్క చెప్పేట్టూ నిశ్చయించాం.

కానీ ఇంకో చిక్కు వచ్చింది. కొందరు స్కూలు పూర్వ విద్యార్థులు కాని వారు పావలాలిచ్చి తాము కూడా వస్తామన్నారు. మాకు ఏంచెయ్యాలో తోచలేదు. దానికీ రామచంద్రుడే ఉపాయం చెప్పాడు. అట్లా రాదలుచుకున్న వారికి అతిథులని పేరుపెట్టితే రానివ్వవచ్చు నన్నాడు. పేరులో ఇంత మహత్తున్నది కదా అనుకున్నాం.

"మనం వెంటనే నాటకం సంగతి చూడాలి. బోలెడంత సాధన చేస్తేకాని నాటకం రక్తి కట్టదు. నాటకం ఫలానా అని నిర్ణయించుకోవలె. ఆమీద ఆయా పాత్రలకు మనుష్యులను సంపాయించవలె. ఆమీద వాళ్ళకు తరిఫీదు ఇయ్యవలె" అని రామచంద్రుడు మాకు తెలియజేశాడు.

నాటకం నిర్ణయించటానికి చాలా కాలం పట్టింది. ఒకరు హరిశ్చంద్ర అన్నారు. ఇంకోరు చిత్రనళీయ మన్నారు. మరొకరు వేణీసంహార మన్నారు. హిందీ తెలిసి; ఒకడు హిందీలో మేవాడ్ పతన్ ఆడమన్నాడు. "మేవాడ్ వేషాం ఎవరు వేస్తారు? పతన్‌వేషాం ఎవరు వేస్తారు, ఒక్కడికీ హిందీ వచ్చి చావ దాయెను!" అని మేమంతా ఆ మాతృద్రోహిని నోరు మూయించాం.

నాటక నిర్ణయం కూడా రామచంద్రుడి చేతిమీదిగానే కానిమ్మన్నాం. వాడు ప్రసన్న యాదవం అనే నరకాసుర వధ ఆడదామన్నాడు. దాన్లో వేషాలు బహుకొద్దిట, పైగా రెండే స్త్రీ పాత్రలుట. మీదు మిక్కిలి ఆ రెండూ ఒక నటుడే తగలెయ్య వచ్చునట. అట్లా సకారణంగా చెబితే ఎవరు ఒప్పుకోరు కనక? సరే ప్రసన్న యాదవం ఆడదామని తీర్మానించాం.

మేం ఈ నాటకం తీసుకోవటం చాలా విధాలా తెలివైన పని అయింది. మా పాత విద్యార్థుల్లో పగలు చూస్తే రాత్రి కలలోకి వచ్చే కోమటి కుర్రవాడొక డున్నాడు. వాడిది మేఘ గంభీరనాదం. వాడికి రెండు కోరలు పెట్టి ఒక్క నల్ల చొక్కా తొడిగి, రంగు కాగితాల గద చేతికిస్తే సాక్షాత్తూ నరకాసురుడల్లే ఉంటాడు.

కృష్ణవేషగాడు కూడా తడుపుకోకుండా దొరికాడు. మా కాంతారావు బస్తీకి వెళ్ళి చాలాసార్లు నాటకాలూ అవీ చూడటమే కాకుండా, రామనాథశాస్త్రీ, తుంగల చలపతిరావూ, వేమూరి గగ్గయ్యా, నిడుముక్కల సుబ్బారావూ మొదలైనవాళ్ళ గ్రామఫోనులో పాడిన పాటలు ధాటిగా పాడగలడు. తరువాత వాడికి మొహాన రంగు కొట్టుకోటం చాతవును.

ఇంద్రుడు నన్ను వెయ్యమన్నారు. నేను ఎన్నడూ స్టేజీ ఎక్కిన పాపాన పోయినవాణ్ని కాను. నాకు స్టేజిమీద ముచ్చెమటలు పోసి శరీరం కంపిస్తుందేమో

నని ఉన్న మాట చెప్పాను. అసలు ఇంద్రుడు అట్లాగే ఉండాలన్నాడు రామచంద్రుడు. ఆ నాటకంలో ఇంద్రుడికి వణకటం తప్ప ఆటే చెయ్యవలసిన పని లేదుట.

ఇక ఆడవేషం ఒకటి మిగిలిపోయింది. (మిగతా చిల్లర వేషాలు సులభంగానే సర్దేశాం.) శ్రీరాములు పేరు అందరికీ ఒక్కసారే తట్టింది. వాణ్ని చిన్నప్పుడు మేం "పిల్లా! పిల్లా!" అని ఏడిపించే వాళ్ళం. వాడి మొహం గుండ్రంగా చంద్రబింబమల్లే ఉంటుంది - ఇంతంత బుగ్గలు వాడూ? అంతకు మించినవాడు ఆడవేషానికి దొరకడని అందరం ఒప్పుకున్నాం. వాళ్ళ నాన్న యాచనా వృత్తితో జీవించేవాడు. ఆయన అనుజ్ఞ తీసుకోవాలని ఎవరికీ తట్టలేదు.

రెండు ప్రసన్న యాదవం ప్రతులు సంపాయించి సాధన మొదలు పెట్టాం. రెండురోజులు కాగానే రామచంద్రుడు తల అడ్డంగా తిప్పి, "లాభం లేదు. రోజుకు మరి రెండు గంటలు సాధన చెయ్యాలి. నరకాసురుడి నటన మరొక అర్థంలో భయంకరంగా ఉంది. కృష్ణుడి నాజూకుచూస్తే నాకు ఆరు డబ్బీలు అమృతాంజనం అర్ధరివ్వక తప్పేట్టు కనుపించలేదు. ఉన్నంతలో నీదే బాగున్నట్టుందేమిట్రా?" అన్నాడు.

"తొందరపడకు!" అన్నాను నేను.

మరిరెండు రోజులు గడిచినై. మేము సాధన చేస్తుంటే ఊళ్ళో వాళ్ళంతా అక్కడే ఉండటం మొదలు పెట్టారు. రామచంద్రుడు ఏమీ చెయ్యలేక పోయినాడు.

అయిదో రోజునో ఆరో రోజునో శ్రీరాములు తండ్రి మామీద ఉప్పెనల్లే విరుచుకు పడ్డాడు; మా కందరికీ బుద్ధి లేదన్నాడు, తన కొడుకు వేషం వేస్తే తనకు అటూ ఇటూ పధ్నాలుగు తరాలు గతుల్లేకుండా పోతయ్యన్నాడు. వాడు వచ్చే జన్మలో ఆడదై పుడుతుందన్నాడు. వాడికి తరవాతి ప్రాయశ్చిత్తం చేస్తే గాని తన ఇంట కూడు పెట్టనన్నాడు. తన భార్య అయిన వాడి తల్లి నూతిలో కూడా దూకుతుందన్నాడు. మాకేం చెయ్యాలో తోచలేదు. శ్రీరాముల్నే అడుగుదా మనుకుంటే, వాడు తండ్రి ఈ వాకిట్లో ప్రత్యక్షం కాగానే, ఆ వాకిట్లో నించి జారుకున్నాడు. మళ్ళీ మర్నాటిదాకా కనిపించలేదు.

మా ఆట కట్టయింది. ఆడవేషానికి ఉన్నదే ఒకడు. వాడొక్కడూ ఊడాడు. ఆ రోజు రాత్రి నా దగ్గిరికి శివన్నావధాన్లు కొడుకు పార్వతీశం వచ్చాడు. ఊరికేనే వచ్చానని కూడా వాడు ఎంతకూ వెళ్ళి పడుకుని నిద్రపోక పోవటం చూసి నేను ఏమిటి కథ అని అడిగాను.

"మన నాటకం ఎట్లా ఆడవేషం లేకపోతే?" అన్నాడు.

"నిజమే!" అన్నాను.

"పోనీ, ఆ ఆడవేషం ఇంకెవరన్నా వేస్తే?"

"బాగా చెప్పావు! మా కెవరికీ తట్టలేదు. ఇంకెవరున్నారు?"

"నేను వేద్దును గాని_"

"ఊఁ!"

"నేను వేస్తే బాగుండదేమో!"

"ఆఁ!"

"అంత అసహ్యంగా ఉండదేమో!"

"రానీ!"

"నేను వెయ్యనా ఆ వేషం?"

నాకు లోపల ఆపుకోటానికి వీల్లేనంత నవ్వు రావటమేకాక, ఈ మాట ఎప్పుడు వెళ్ళి చెప్పుదామా అన్న ఆవేదనతో మూర్ఛకూడా వచ్చేట్టయింది.

పార్వతీశం, ఆడవేషాని కేమిటి, కురూపి వేషానికన్నా పనికి రాడు. వాడిది పాడు మొహం. చప్పి దవడలు. గుంటకళ్లు, వంకర మూతి, వాడు ఆ వేషం వెయ్యటానికి చస్తున్నాడని తెలుస్తూనే ఉంది.

"రేపు రామచంద్రుడితో చెబుతాలే!" అని వాణ్ని అప్పటికి పంపించాను.

రామచంద్రుడు అంతా విని "ఏదో విధంగా ఈసారికి తగలేదాం. వాడి చేత వేషం వేయిస్తే వాళ్ళ నాన్న మనమీద మరఫిరంగులు పేల్చదనుకుంటాను," అన్నాడు.

"ఆయన వీణ్ని వదిలిపెట్టి ఊరుకున్నాడు. లేకపోతే వీడు చాటుగా బీడీలూ అవీ తగలెయ్యటం ఎందుకు జరుగుతుందీ? ఆ భయం లేదనుకుంటాను గాని, వీడు ఆడవేషం ఏమ్రిటా?" అన్నాను.

"ఇప్పు డవన్నీ పెట్టుకుంటే - నే చెప్పేది_"

సరే, కానీ మన్నాను.

పార్వతీశం మొదటినాడు చేసిన సాధన తలుచుకుని మేము నవ్వు జాస్తయి చెరొక నూలా మడతబడి ఏడిచాం, నా గదిలో.

"ఆ పార్వతీశంగాడు మాటలు ఈడవటం_"

"వాడు పాడటం!_"

"వాడు చేతులు తిప్పటం!_"

"వాడి మూతి!_"

"వాడి కళ్లు_"

చిట్ట చివరకు ఇద్దరమూ కొంత శాంతించి ఏం చెయ్యాలా అని ఆలోచించటం మొదలుపెట్టాం.

"నాకు ఒక్కటే తోస్తున్నది. నాటకం నాలుగైదు రోజుల్లోకి వచ్చింది. ఇప్పుడు చేసేదేమీ లేదు. నాటకం పేరు ప్రసన్న యాదవ ప్రహసనమని చాటేస్తాను." అన్నాడు రామచంద్రుడు.

పార్వతీశం అభినయం నిజంగా వర్ణనాతీతం. వాడు పోర్షను చెబుతుంటే అమిత అసహ్యంగా, కృత్రిమంగా ఉంది. ప్రతిదానికీ ఏదో దీర్ఘం పెట్టేవాడు. సహజమైన ఆడతనానికి ఎక్కడా సంబంధం లేకుండా వాడొక కొత్త రకం స్త్రీత్వం సృష్టించాడు. అది వాడిబుర్రలో పుట్టి నేడు ఆంధ్రులంతా సహజమైన ఆడతనం కింద పరిగణిస్తున్నది. పార్వతీశం ఈనాడు చాలా గొప్పనటుడుగా ఎన్నబడుతున్నది. వాడి స్టేజీమీద చూపించే ఆడవేషాలు ఆడవేషాలుగా ఆమోదింప బడుతున్నై. ఆడది అంతకన్న ఎక్కువగా చెయ్యలేదని అందరూ ఒప్పుకున్నారు. ఆనాడు మా ప్రసన్న యాదవం రిహార్సలులో ఎట్లా చేశాడో ఇప్పుడూ స్టేజీమీద అట్లాగే — ఇంకొంచెం పొగరుగా చేస్తున్నాడు పార్వతీశం. ఆనాడు నేనూ మా రామచంద్రుడూ అట్లా నవ్వుకున్నామంటే మాకు ఆంధ్రసోదరుల అభిరుచి ఏమీ తెలియదన్నమాట. పార్వతీశాన్ని చూసి మూర్ఛ పొయ్యేవాళ్ళో మేమో గుడ్డివాళ్ళమయి ఉండాలి!

ఎట్లాగయితేనేం, మాపూర్వ విద్యార్థిసంఘ వార్షికోత్సవదినం వచ్చిపడ్డది. ఆరోజు ఉదయంవరకూ మాకు వసూలయిన చందాల మొత్తం ఏడురూపాయల ఎనిమిదణాలు. టిఫినుకు తయారయిన వారిసంఖ్య డెబ్బైరెండు. ఏంచెయ్యాలో రామచంద్రుడికి పాలుపోలేదు.

"మొహమోటపడితే లాభంలేదు!.... అబ్బాయిలూ, చందా ఇవ్వనివారు తలా ఒకపావలా ఇచ్చి మరీ అల్పాహారానికి రండి!" అని కేకవేశాడు రామచంద్రుడు.

అందరికీ కోపాలు వచ్చినై.

"మీ అల్పాహారంకోసం రాలేదు; మాలకుంకలల్లే మేం సంధ్యావందనమైనా చేసుకోకుండా అడ్డమైనగడ్డీ తినం!" అని చెప్పారు ఒకరిద్దరు.

డబ్బిచ్చినవాళ్ళం మాత్రమే ఉప్మా కాఫీలు సేవించాం. మాకు అది వంటపట్టిందని కాని, మానోట్లో తినుబండారాలు మట్టికాలేదని కాని ఎవరూ అనుకోవద్దు.

ఈ ఏర్పాటంతా పిచ్చి శంకరయ్యగారి మామిడితోటల్లో చేశాం. అక్కడే

ఒక చిన్న మీటింగు ఏర్పాటుచేసి వచ్చే సంవత్సరం తంతు నడిపించవలిసిన బాధ్యత ఈ ఉపసంఘంమీద పెట్టాడు. మధ్యాహ్నం భోజనాలు కూడా శంకరయ్యగారి తోటలోనే జరిగినై.

నాటకం ఏర్పాటంతా నానెత్తిన వేశారు. మాపక్క గ్రామంలో దివాలా ఎత్తిన నాటకసమాజం తాలూకు తెరలుంటే వాటిని మాట్లాడి ఉంచాను. తెనాలి నించి రంగులూ, డ్రెస్సూ ఎగ్గులూ, విగ్గులూ అవీ తెస్తానని ఒకరు వాగ్దానం చేశారు. హార్మోనియమూ వాయించేవాడూ మావూరికి మూడుకోసుల దూరంలో ఉన్న మరొక ఊర్నించి వచ్చేటట్టు ఏర్పాటు చేశాను. నాటక ప్రదర్శనం లచ్చయ్యగారి గొడ్లసావిట్లో పెట్టాం. మా అదృష్టం బాగుందని చెప్పాలి. డ్రెస్సులు తెరలు వగైరాలు సమయానికి వచ్చినై. అయితే దుస్తులు హరిప్రసాదరావుగారి చిన్నతనం నాటివి. తెరలు చూడబోతే ఒకటి సరస్వతి (కళ్ళు రెండూ బొక్కలు పొడిచారు!) రెండోది కొండమీదికి వెళుతున్న ఒక సన్ననిగల్లీ (దానికిరుపక్కలా గారడిచేత పడకుండా ఉన్నటువంటి మేడలూ!) మూడోది ఏమిటో అర్థంకాలేదు, సూర్యాస్తమయం అనుకుంటాను. మధ్య ఎర్రరంగూ, చుట్టురా మాసిపోయిన ఆకుపచ్చరంగూ — ఇంకేమీ లేదు!

అయితే అటే పట్టింపులకుపోక ఉన్నవాటితో సరిపెట్టదలచుకున్నాం. మధ్యాన్నం మూడింటినించీ తెరలు కట్టటం మొదలుపెడితే ముగ్గురు జమాజెట్టీలకు మూడుగంటలు పట్టింది. తెనాలినించే మూడు గాసులైట్లు వచ్చినై, చీకటిపడే వేళకు, అందులో ఒకటి మండితే మండటం, ఆరితే ఆరటం తప్ప వెలగటం అనేది లేదు. ఎట్లాగో అవస్తపడి ఏడున్నరకు వేషాలుతప్ప మిగతాది యావత్తూ సిద్ధంచేశాం.

కృష్ణపాత్రధారి కాంతారావే అందరికీ రంగు అంటించవలిసి వచ్చింది. వాడు తనకు వేసుకున్న చేత్తోనే నాకూ రంగు వెయ్యటం మొదలుపెట్టాడు. ఒక గాసులైటు సహాయ నిరాకరణం చెయ్యటంవల్ల మేము గ్రీన్‌రూములో మామూలు లాంతరుతో పనికానిచ్చాం. ఒకటే అద్దం ఉండటంవల్లా, దాన్ని స్త్రీపాత్రధారి పార్వతీశం లంకించుకుని వదిలిపెట్టకపోవటంవల్లా, నేను నామొహం అద్దంలో చూసుకునే యోగ్యత కలగలేదు. అప్పటికీ ఎవరో అన్నారు, "అదేమిట్రా? నీమొహం అట్లాఉందని" కాని ఇంతలో, అప్పుడే రెండోబెల్లు కూడా కొట్టిన రామచంద్రుడు, "ఇంద్రుడి కోర్టు! ఎక్కడ ఇంద్రుడు! రారా? ఆలస్యం చెయ్యక! దక్పాలకులూ! రండోయ్!" అని నన్ను తెరల మధ్యకి తరిమాడు. నాకోర్టు సూర్యాస్తమయం సీనుతో ఏర్పాటయింది. పోనిపొమ్మనుకున్నాను.

రామచంద్రుడు మూడోబెల్లుకొట్టి ఈలవేశాడు. కమసాలి అయన బయ్‌మని "పరాబ్రహ్మ" వాయించాడు. మద్దెలవాడు (ఊళ్ళోవాణ్ణే పెట్టాం) దబాయించి మద్దెల వాయించాడు. సగంవేషాలు వేసుకున్న వాళ్ళూ, పూర్తిగా తయారైన వాళ్ళూ, అసలువేషమే లేనివాళ్ళూ స్టేజీలోకి వచ్చారు. పార్వతీశం హారతిపళ్ళెం పట్టుకుని అమితభక్తి నటిస్తూ పాడటం మొదలుపెట్టాడు. "వాందిత సుఖదా ప్రమేయ" అని అరవాలిసినచోట, నన్నూ మరొకణ్ణీ వదిలిపెట్టి మిగతావాళ్ళు అకస్మాత్తుగా సద్దుమణిగేటప్పటికి నాకు పుట్టిన కంపరం చెప్పలేను.... మా ఇద్దరి గొంతులయినా ఎక్కడా కలవకుండా వచ్చినై!

తెరఎత్తారు. గొడ్లసావిడి కిటకిట లాడుతున్నది. నాకు అరికాళ్ళదగ్గర్నించీ కంపరం మొదలుపెట్టింది. నాకు మరిముగ్గురు తోడుగా కూర్చున్నారు మీసాలు పెట్టుకుని, మీసాలున్నా వాళ్ళ పేడిమూతులు నాకు మరుపురాకపోయినై. నేనులేచి "దిక్పాలులారా!" అని మొదలుపెట్టేటప్పటికి జనం యీపత్తూ ఒక్కసారి గొల్లుమన్నారు నాకేమీ అర్థంకాలేదు. చివరకు యమధర్మరాజు వేసినవాడు, మీసాలు కదలకుండా, వణుకుతున్న గొంతుతో మాట్లాడుతూ, "నీ మొహాన వచ్చని ఆకుపచ్చరంగు?" అన్నాడు.

మిగతా ప్రదర్శనం గురించి ఎక్కువగా చెప్పవలిసిందిలేదు. మాణిభద్రుడి నెత్తిన తాడుతెగి తెరపడటంవల్ల వాడిస్వగతం మధ్యనే ఆగిపోవడమేకాక తరవాత మరొక రంగంకూడా ఎత్తివెయ్యవలసి వచ్చింది. జనం అమితగోల చేస్తూ వచ్చారు.

"డామ్‌ఫూల్! ఏమిటా మొహానరంగు!" అన్నాడు రామచంద్రుడు నన్ను పట్టుకుని.

"ఏడిచావులేరా?.... జనం ఏమిటి మరీ అంత గోల చేస్తున్నారు"

"మనం పొద్దున ఫలహారాల దగ్గిర అంత ఖచ్చితంగా మాట్లాడటం ప్రాణంమీదికి వచ్చింది.... ఇంకా పార్వతీశంగాడు వచ్చిన తరవాత సాగుతుంది ఏంసాగినా, కొలువు చూశావుగా నరకాసురుడు రాగానే ఎట్లా పెడబొబ్బ పెట్టారో, 'శ్రీమద్రమారమణ గోవిందో హరి' అని!

ఆ తరవాత జరిగినది నాకు ఈనాటికీ అర్థంకాదు. పార్వతీశం స్టేజిమీదికి రాగానే ప్రేక్షకులమీద మత్తుమందు చల్లినట్టయింది. పార్వతీశం రిహార్సలులో ఎట్లా చేశాడో స్టేజిమీదా అట్లాగే చేశాడు. ఏక్షణాన పాతచెప్పు పడుతుందో అని మాఇద్దరి ప్రాణాలూ పీచుపీచు మంటున్నై, కాని అటువంటిదేమీ జరగలేదు. పార్వతీశం యొక్క స్త్రీ పాత్రాభినయం ప్రేక్షకులు మంచినీళ్ళదక్కుండా

మింగటం మొదలుపెట్టారు. సహజంగా మాకు కొంత సేపటివరకూ ప్రేక్షకుల ఉద్దేశం అర్థం కాలేదు.

హాలంతా నిశ్శబ్దంగా ఉంది. పార్వతీశం చీరెమార్చకుండానే ఊర్వశిగా స్టేజిమీదికి వచ్చాడు.

"సత్యభామ! సత్యభామ! అని ఎవరో కేకవేశారు.

"ఇస్!"

"ఎవఁడా వాడూ?"

"నిశ్శబ్దం!" అని అన్ని వేపులనించీ కేకలు వినపడినై.

"పార్వతీశం లేకపోతే నాటకం రక్తికట్టకపొయ్యేదే!" అన్నారు ఊళ్ళో అంతా, వాడి ప్రదర్శనం చాటున మేము పొద్దున చేసిన అపరాధం కూడా వెనక పడిపోయింది! దాన్నెవరూ తలిచినవారు లేరు!

(ప్రథమ ముద్రణ : జనవరి 1936, వినోదిని)